



ధర్నా చేస్తున్న నాయకులు

భారాలు మోపే పాలకులపై పోరాటం

- విద్యుత్ ఛార్జీలు బారాలను ఉపసంహరించుకోవాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకర్ రెడ్డి



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి -ఎమ్మిగనూరు

ప్రజలపై బారాలు మోపే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని, ట్రూఆప్‌పేరుతో రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీల భారాలను ఉపసంహరించుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె. ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. డిసెంబర్ 29, 30 తేదీల్లో జరుగు సిపిఎం కర్నూలు జిల్లా మహాసభలు ఆహ్వాన సంఘ సన్నాహక సమావేశం జిల్లా కమిటీ సభ్యులు గోవిందు అధ్యక్షతన నిర్వహించారు. కె.ప్రభాకర్ రెడ్డి, జిల్లాకార్యదర్శి గౌస్ దేశాయ్ మాట్లాడుతూ కేంద్రంలోని మతోన్మాదాన్ని పెంచిపోషిస్తోన్న బిజెపి దేశాన్ని పాలిస్తుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అనేక హామీలు ఇచ్చి వాటి అమలు చేయక ప్రజలను మభ్య పెడుతూ రామ మందిరం నిర్మాణం పేరుతో మూడోసారి కేంద్రంలో బిజెపి మరోసారి అధికారంలోకి వచ్చిందన్నారు. అయోధ్యలో నిర్మించిన రామ మందిరం ప్రాంతంలో సైతం బిజెపి ఓడ పోయిందని, దీన్ని బట్టి మతాన్ని బట్టి ఓట్లు పడవని బిజెపి గుర్తుంచుకోవాలన్నారు. భారత రాజ్యాంగాన్ని గౌరవించాల్సిన బాధ్యత ప్రతి పార్టీపై ఉందన్నారు. రాష్ట్రంలో టిడిపి నేతృత్వంలోఏర్పడిన కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చిందని హామీలు అమలు చేయడంలో మీన మేషాలు లెక్కిస్తుందన్నారు. గత ఐదేళ్లుగా బాదుడే బాదుడు అంటూ తమ ప్రభుత్వం వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమని పేర్కొని నేడు రూ.వేలకోట్ల విద్యుత్ భారాలు మోపడానికి సన్నద్ధమయిందన్నారు. నిత్యవసర సరుకులు సామాన్య ప్రజలు కొనలేని పరిస్థితిలో ఉందన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవా లన్నారు. కేంద్రంలోని ప్రజా వ్యతిరేక మతోన్మాద వ్యతిరేక పోరాటాలు సన్నద్ధమవుతూ ప్రజలను జాగృతం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మిగనూరులో నిర్వహించే జిల్లా మహాసభ జిల్లాలోని, ఎమ్మిగనూరు ప్రాంతంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి ఒక వేదిక కావాలన్నారు. ఆ మహాసభల ముందు ప్రజా సమస్యలను పూర్తి అధ్యయనం చేసి, ఆ మహాసభల్లో సమస్యల పరిష్కారానికి తోడ్పడేటట్లు మహాసభ తీర్మానాలు ఉండాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామాంజనేయులు, పిఎస్.రాధాకృష్ణ, వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యులు గోవిందు, లింగన్న, గురు శేఖర్, ఆనంద్ బాబు, స్థానిక నాయకులు హనుమంతు, రాముడు తిమ్మన్న, సురేష్, అబ్దుల్లా, లక్ష్మీ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వాన కమిటీ ఎంపిక

సిసిపిఎం జిల్లా మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులుగా పి.గోవిందు, ఉపాధ్యక్షులుగా లక్ష్మీ నరసయ్య, అబ్దుల్ ,రాముడు, ఆంథోని, ఆదెన్న, అడ్వకేట్ తిమ్మప్ప, కరుణాకర్, దేవపుత్ర, ప్రధాన కార్యదర్శిగా సి హనుమంతు, కార్యదర్శులుగా చేనేత కృష్ణ, రమేష్, తిమ్మన్న, ఎల్లేష్, దండు ఖాజా, దేవేంద్రమూర్తి, కమిటీ సభ్యులుగా పరమేశు కె. నర్సింహులు, రంగస్వామి, రాజు, వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ సమస్యలపై

జెసి జోక్యం అవసరం : రైతు సంఘం

- వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ముందు ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

కర్నూలు ఉల్లి మార్కెట్ సమస్యలపై, అవకతవకలపై తక్షణమే విచారణ జరిపించాలని, జాయింట్ కలెక్టర్ జోక్యం చేసుకుని రైతులకు న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం వ్యవసాయ మార్కెట్ యార్డ్ కార్యాలయం ముందు ఎపి రైతు సంఘం మండల అధ్యక్షులు జి.ఆంజనేయులు అధ్యక్షత ధర్నా చేశారు. జి.రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలోనే ఈ సంవత్సరం ఉల్లి అత్యధిక పంట దిగుబడి వచ్చిందని, మార్కెట్‌లో దాదాపు 65 వేల క్వింటాళ్ల స్టాక్ ఉందని అధికారులు చెప్తున్నారన్నారు. పంట దిగుబడి వచ్చినా రైతులు అనేక రకాల సమస్యలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మంచి ఉల్లిగడ్డలు కూడా ధర లేక రైతులు వెనక్కి తీసుకెళ్తున్న పరిస్థితి నెలకొందన్నారు. వచ్చిన సరుకులో కొన్ని లాట్లు మాత్రం కొద్దిగా ఎక్కువ రేటు చూపించి మిగతా అంతా అత్యంత తక్కువ రేటుకు కొనుగోలు చేస్తున్నారన్నారు. ఈ నామ్ పద్ధతి వలన రైతులకు ఉపయోగం ఉంటుందని నమ్మబలికి దేశంలో వివిధ ప్రాంతాల నుండి టెండర్లలో పాల్గొంటారని, ఫలితంగా రేటు అత్యధికంగా వస్తుందని చెప్పారన్నారు. ఆచరణలో ఏమాత్రం కూడా మెరుగు లేదన్నారు. ఆఫ్ లైన్ అయినా, ఆన్ లైన్ అయినా ఒకే రకంగా ఉందన్నారు. ఉల్లి రైతులకు న్యాయం జరగాలంటే గిట్టుబాటు ధర రూ.3 వేల నుండి రూ.5000 వరకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కర్నూలు మార్కెట్‌లో నాలుగు రోజులుగా కొనుగోలు ఆపివేశారని, కారణం ఏమంటే సర్వర్ పని చేయడం లేదని, ఉల్లి నిలువలు ఎక్కువ అయ్యాయని, మార్కెట్ యార్డ్ అధికారులు తెలుపుతున్నారని అన్నారు. ఇక్కడ కొనుగోలు చేసిన ఉల్లిగడ్డలు మార్కెట్లోనే నిల్వ ఉండడం వలన రైతులకు అసౌకర్యంగా మారిందన్నారు. రైతుల దిగుబడులు ఆరుబయట పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిం దన్నారు. వ్యాపారస్తులకు ఇచ్చే ప్రాముఖ్యత రైతులకు ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా తక్షణమే వ్యాపారస్తులు కొనుగోలు చేసిన ఉల్లిగడ్డలను తరలించాలని డిమాండ్ చేశారు. నాలుగు రోజులుగా కొనుగోలు లేక రైతులు రాత్రింబవళ్లు కాపలా ఉండాల్సిన పరిస్థితి ఉందన్నారు. తక్షణమే మార్కెట్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఉల్లి రైతులకు న్యాయం జరేగేలా అధికారులు చర్యలు తీసుకోకపోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎ.కృష్ణ, పంచ లింగాల మాజీ సర్పంచి బి వెంకటేశ్వర్లు, జిబి మద్దిలేటి, కేతవరం మద్దిలేటి, జి.సింగవరం ఆదాం, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, సురేష్, ప్యాపిలి రైతు నాయకులు రామాంజనేయులు పాల్గొన్నారు.

పట్టుదలతో లక్ష్యాన్ని సాధించాలి

- జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలలో డిఇఒ శామ్యూల్ పాల్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

విద్యార్థులు పట్టుదలతో లక్ష్యాన్ని సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.శామ్యూల్ పాల్ సూచించారు. ఆదివారం జన విజ్ఞాన వేదిక జిల్లాస్థాయి చెకుముకి సంబరాలు మాంటిసోరి హైస్కూలులో నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు బిడి సుదీర్‌రాజు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ శామ్యూల్‌పాల్, యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్ పాల్గొన్నారు. డిఇఒ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల కలిగి ఉంటే ఎంతటి లక్ష్యాన్ని అయినా సాధించ వచ్చన్నారు. శాస్త్రీయ శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలన్నారు. సోషల్ మీడియా పరిమితంగా ఉపయోగించాలని, చదువులపై దృష్టి కేంద్రీక రించాలన్నారు. జన విజ్ఞాన వేదిక చెకుముకి సంబరాలు నిర్వహించడం విద్యార్థులందు శాస్త్రీయ భావనలను కలిగించడం అభినందనీయమన్నారు. రాష్ట్రస్థాయి చెకుముకి సంబరాల్లో కర్నూలు జిల్లాకే అవార్డులు తీసుకురావాలని ఆయన కోరారు. కె.సురేష్ కుమార్‌తో పాటు రాష్ట్ర యూత్ కన్వీనర్ డాక్టర్ సురేష్ మాట్లాడుతూ ప్రతి సమస్యను శాస్త్రీయంగా ఆలోచించి పరిష్కారం కనుగొనాలని సూచించారు. పాఠశాల కరికులంలో విద్యార్థుల విజ్ఞానాన్ని పెంపొందించే విధంగా పాఠ్యాంశాలు ప్రవేశపెట్టాలన్నారు. మూఢనమ్మకాలను నిర్మూలించే విధంగా పాఠ్యాంశాలు పొందు పరచాలన్నారు. అనంతరం జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా నిర్వహిస్తున్న టెస్ట్ ప్రశ్న పత్రాలను అతిథులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాజాహుస్సేన్ , సాహితీ స్రవంతి రాష్ట్ర నాయకులు జంద్యాల రఘుబాబు, సమతా కన్వీనర్ రమాదేవి, జన విజ్ఞాన వేదిక నాయకులు దేవమణి, శంకరయ్య , రుద్రముని, ఆజాద్, వెంకటేష్, ఆర్యన్, సాయి అబ్దుల్లా , అల్తాఫ్ డాక్టర్ హనీఫ్ పాల్గొన్నారు.


ప్రశ్నపత్రాలను విడుదల చేస్తున్న డిఇఒ శామ్యూల్ పాల్, జెవివి, యుటిఎఫ్ నాయకులు

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

- విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టాలి
- 75 శాతం హాజరు ఉంటేనే పరీక్షలకు అర్హత
- ప్రజాశక్తితో కర్నూలు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూలు మెడికల్ కళాశాలలో విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, ఇంటికి పంపించడం ఖాయమని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ స్పష్టం చేశారు. అలాగే 75 శాతం హాజరు ఉంటేనే పరీక్షలకు అర్హత సాధిస్తారని, లేకపోతే పరీక్షలు రాయడానికి అంగీకరించబోమని తెలిపారు. కళాశాలలో ఫ్యాకల్టీ, ఇతర సౌకర్యాలపై విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన ఇతర కరికులం ఆక్టివిటీస్‌పై కర్నూలు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ ప్రజాశక్తితో ముఖాముఖిగా మాట్లాడారు...



కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులు ఎంతమంది చేరారు? వారు పరీక్షలలో ఫెయిల్ అయితే ఎలాంటి నిబంధనలు ఉన్నాయి?

ప్రిన్సిపల్ : కళాశాలలో ప్రభుత్వ నిబంధన మేరకు కౌన్సెలింగ్ ద్వారానే ఇప్పటికి 242 మంది విద్యార్థులు చేరారు. ఇంకా ఎనిమిది మంది విద్యార్థులు చేరాల్సి ఉంది. మొదటి సంవత్సరంలో మూడు సబ్జెక్టుల్లో విద్యార్థులు ఉత్తీర్ణత కావాల్సిందే లేకపోతే మళ్లీ మొదటి సంవత్సరమే చదవాల్సి ఉంటుంది. ఆ తరువాత రెండవ సంవత్సరం నుంచి చివరి సంవత్సరం వరకు విద్యార్థులు ఫెయిల్ అవుతున్నా తరగతులు అప్‌గ్రేడ్ అవుతారు. చివరి ఏడాదికల్లా అన్ని సబ్జెక్టులు పూర్తి చేసుకుంటేనే వారి గ్రాడ్యుయేషన్ కోర్సు పూర్తి అవుతుంది.

కళాశాలలో టీచింగ్ స్టాఫ్ పూర్తిస్థాయిలో నియమించబడ్డారా? ఖాళీలు ఉంటే వారి సబ్జెక్టులను ఎలా పూర్తి చేస్తారు?

ప్రిన్సిపల్ : కళాశాలలో టీచింగ్ స్టాఫ్‌లో కొన్ని ఖాళీలు ఉన్నది వాస్తవం. వీటిని భర్తీ చేసేందుకు ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్లాం. అయినా విద్యార్థులకు సిలబస్ పూర్తి చేసేందుకు ఇతర ఫ్యాకల్టీస్‌తో చర్చించి విద్యార్థులకు న్యాయం చేస్తాం. పరీక్షల సమయానికి అంతా సిలబస్‌ను పూర్తి చేసి విద్యార్థులను సిద్ధం చేస్తున్నాం.

కళాశాలలో ఇటీవల కాలంలో సోషల్ మీడియాలో రాగింగ్ కలకలం వచ్చింది దీనిపై ఏమంటారు?

ప్రిన్సిపల్ : ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు జిల్లా స్థాయి పోలీసులు, న్యాయమూర్తుల సహకారంతో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. విద్యార్థులు కూడా వారి భవిష్యత్ గురించి ఆలోచిస్తున్నారు. ర్యాగింగ్ కు దూరం ఉండాలని ప్రతిజ్ఞ చేయిస్తున్నాం. అయితే కొందరు కళాశాలలో ర్యాగింగ్ జరుగుతోందని సోషల్ మీడియాలో ఊహగానాలు వ్యాప్తి చేస్తున్నారు. ఇది సరైనది కాదు. ఈ అంశంపై కళాశాల వసతి గృహంలో హాస్టల్ వార్డెన్, ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ వేరువేరుగా మొదటి సంవత్సరం విద్యార్థులతో సమావేశమై పరిశీలించాం. ర్యాగింగ్ చేసిన వారు ఉంటే సీక్రెట్‌గా చెప్పినా ఫిర్యాదులు స్వీకరిస్తాం. కళాశాలలో ఫిర్యాదు బాక్సులు కూడా ఏర్పాటు చేశాం. వాటిని తీసి ఫిర్యాదు, అర్జీలు ఉంటే స్వీకరించి చర్యలు తీసుకుంటాం. కానీ ఫిర్యాదు బాక్సుల్లో కూడా ఎలాంటి అర్జీలు లేవు. విద్యార్థులు డ్రెస్ కోడ్ పాటించాలని అధ్యాపకులతో పాటు ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్స్ కూడా విద్యార్థులకు చెబుతున్నారు. సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని, ఇంటికి పంపించడం ఖాయమని ఇప్పటికే పలు సమావేశాల్లో చెబుతున్నాం. సోషల్ మీడియాలో వచ్చిన ర్యాగింగ్ కలకలం గురించి త్రిసభ్య కమిటీ వేసి విచారిస్తున్నాం.

కళాశాలలో పిజి సీట్లు ఎన్ని ఉన్నాయి? ఎన్ని డిపార్ట్మెంట్లు ఉన్నాయి?

ప్రిన్సిపల్ : కర్నూలు వైద్య కళాశాలలో 30 డిపార్ట్మెంట్లు ఉన్నాయి. డిపార్ట్మెంట్లకు అనుగుణంగా మొత్తం 179 పీజీ సీట్లు ఉన్నాయి. ఇంకా సూపర్ స్పెషాలిటీ విభాగంలో 20 పీజీ సీట్లు ఉన్నాయి. అలాగే కొన్ని డిపార్ట్మెంట్లకు సంబంధించి డిఎం సీట్లు రెండు చొప్పున ఉన్నాయి. డిఎం సీట్లు ఆయా డిపార్ట్మెంట్లలో వచ్చే కేసులు వైద్య చికిత్సలు తదితర అంశాలను అనుసరించి కేటాయిస్తారు.




ఉచిత వైద్యశిబిరంలో వైద్యులు భరత్, వినోత్, స్వాతి

ఉచిత వైద్యశిబిరం విజయవంతం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సుందరయ్య స్ఫూర్తి కేంద్రం ఆధ్వర్యంలో ప్రతి రెండు నెలలకోసారి ఉచిత వైద్య సేవా శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఇందిరాగాంధీ నగర్ లోని సుందరయ్య భవన్‌లో డాక్టర్ భరత్, డాక్టర్ వినోద్, డాక్టర్ సంధ్య, డాక్టర్ స్వాతి, డాక్టర్ నాగభూషణంలు వైద్య సేవలు అందజేశారు. ఈ వైద్య శిబిరంలో ముందుగా బిసి షుగర్ పరీక్షలు చేయించుకుని వచ్చిన వారికి, పక్షవాతం, మూర్చ వ్యాధులకు సంబంధించిన రోగులకు ప్రతి రెండు నెలలకు రూ.3000 విలువచేసే మందులు కేవలం రూ.300 అందించారు. ఈ వైద్య శిబిరంలో సుందరయ్య స్ఫూర్తి కేంద్రం కన్వీనర్ ప్రసాద్ శర్మ, జెఎన్.శేషయ్య, నాయకులు రంగస్వామి, సహాయ సహకారాలు అందించగా మెడికల్ రెప్‌లు ఖలీల్, షేక్షా, శంకర్, రామసుబ్బయ్య ,పుల్లయ్యశాస్త్రి ,శంకర్‌లు మందులను అందజేశారు. కార్యకర్తలు బసయ్య, వెంకటేశ్వర్లు, ఎల్లాగౌడ్, హుస్సేన్ ,సుధాకరప్ప, గోపాల్, హుస్సేనయ్య, ప్రమోద్ సేవలను అందజేశారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 100 మందికి వైద్యం చేసి మందులు అందజేశారు.


డిఇఒకు శామ్యూల్‌పాల్‌కు ఉపాధ్యాయుల సంఘాల నాయకుల శుభాకాంక్షలు

డిఇఒకు ఉపాధ్యాయ సంఘాల శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లా విద్యాశాఖ అధికారిగా నియమితులైన ఎస్.శామ్యూల్ పాల్‌కు పలు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు కలిసిశుభాకాంక్షలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ టీచర్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు జి.హృదయ రాజు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇస్మాయిల్, మరియానందం ఇతర నాయకులు సభ్యులు రామకృష్ణయ్య, తిమ్మప్ప, యోగేంద్రబాబు, రాంగోపాల్ రెడ్డి, హబీబుల్లా, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆప్టా ఆధ్వర్యంలో

ఆప్టా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకి ప్రకాష్ రావు జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సేవాలాల్ నాయక్ ఇతర నాయకులు మహమ్మద్ రఫీ, జగదీష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఇఒకు పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు.

రూ.కోటి సభ్యత్వం లక్ష్యం

-ఐటిడిపిని అన్ని విధాల ఆదుకుంటాం- టిడిపి జిల్లా అధ్యక్షులు పి తిక్కారెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

రాష్ట్రంలో మరో కోటి సభ్యత్వం చేయించడం లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని టిడిపి కర్నూలు జిల్లా పార్లమెంట్ అధ్యక్షులు పి.తిక్కారెడ్డి అన్నారు. ఆదివారం కర్నూలు టిడిపి జిల్లా కార్యాలయంలో ఆయన అధ్యక్షతన ఐటిడిపి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టిడిపి సభ్యత్వ నమోదు మొదలైన నేపథ్యంలో ఐటిడిపికి సంబంధించి కర్నూలు జిల్లా వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గానికి 15 మందిని సభ్యత్వ నమోదు చేయాలని ఆదేశించిందన్నారు. వారందరికి కర్నూలు టిడిపి కార్యాలయంలో కర్నూలు జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని 2 నెలలపాటు నిర్వహించనున్నామన్నారు. ఐటిడిపి సభ్యులు ఎన్నికలకు ముందు పార్టీని గెలిపించడంలో ఎనిలేని కృషి చేశారన్నారు. అన్ని త్యాగాలకు కష్టాలకు ఓర్చి పనిచేసిన ఘనత వారికే దక్కుతుందన్నారు. ఐటిడిపి కార్యకర్తల సంక్షేమం కోసం అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించనున్నారు. రాష్ట్రంలో కోటి సభ్యత్వం లక్ష్యంగా పార్టీ అధిష్టానం నిర్ణయించిందని దాన్ని సాధించడానికి కృషి చేయాలని అన్నారు. టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు గత ప్రభుత్వంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని పార్టీకి అండగా నిలిచిన ఐటిడిపి సభ్యులు కృషి అభినందనీయమన్నారు. వారికి తప్పనిసరిగా న్యాయం చేయడానికి ముఖ్యమంత్రి సిద్ధంగా ఉన్నారన్నారు. ఐటిడిపి జిల్లా అధ్యక్షులు గట్టు తిలక్ మాట్లాడుతూ పార్టీ ఆదేశానుసారం సభ్యత్వ నమోదు చేయిస్తామన్నారు. టిడిపి రాష్ట్ర ప్రధాన రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్, టూరిజం డైరెక్టర్ ముంతాజ్ బేగం, కర్నూలు టౌన్ ప్రెసిడెంట్ నాగరాజు యాదవ్, బిసి సెల్ అధ్యక్షులు సత్రం రామకృష్ణుడు, ఐటిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు పి తిక్కారెడ్డి

104 ఉద్యోగులకు భద్రత కల్పించాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

104 ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. అంజిబాబు, 104 ఉద్యోగుల సంఘం మాజీ రాష్ట్ర నాయకులు యాకూబ్, సంఘం జిల్లా కార్యదర్శి పెద్దయ్య డిమాండ్ చేశారు. 104 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేష్ అధ్యక్షతన కార్మిక కర్షక భవన్‌లో ఆదివారం జిల్లా విస్తృత సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 104 ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి ప్రభుత్వమే 104 నిర్వహించాలని డిమాండ్ చేశారు. వారిని పిహెచ్‌సి సెంటర్లో విలీనం చేయాలని కోరారు. 104 ఉద్యోగులకు జీవో నెంబర్ 7 అమలు పరిచి జీతాలు చెల్లించాలని కోరారు. ఇప్పటికే మూడు నెలలుగా వేతనాలు పెండింగులో ఉన్నాయని, పెండింగులో ఉన్న వేతనాలను చెల్లించాలని కోరారు. పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పట్టించు కోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు సిదమవుతామని హెచ్చరించారు. 104 ఉద్యోగుల సంఘం జిల్లా కోశాధికారి చంద్రహాస్, జిల్లా నాయకులు వెంకటేష్, హరి మోహన్, వినోద్ ,కళ్యాణి, చిట్టెమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అంజిబాబు

శిథిలావస్థకు ఎమ్మిగనూరు, కోడుమూరు రోడ్లు

మరమ్మతుకు మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డికి సిపిఎం లేఖ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

శిథిలావస్థకు చేరిన ఎమ్మిగనూరు-కోడుమూరు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని రోడ్లు , భవనాల శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డికి సిపిఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి లేఖ రాశారు. ఈ లేఖను ఆదివారం పత్రికలకు విడుదల చేశారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నుండి కోడుమూరు వరకు ఉన్న రాష్ట్ర రహదారి పూర్తిగా శిథిలావస్థలో ఉన్నదని, రోడ్డు మొత్తం ఎక్కడికక్కడ గుంతలతో ప్రయాణానికి ఏమాత్రం అనుకూలంగా లేదని పేర్కొన్నారు. ఆదోని, మంత్రాలయం నుండి జిల్లా కేంద్రమైన కర్నూలుకు వెళ్లాలంటే ఈ రోడ్డు మార్గం తప్ప మరో మార్గం లేదన్నారు. ప్రతినిత్యం వందల సంఖ్యలో ఆర్‌టిసి బస్సులు, లారీలు, కార్లు, జీపులు వంటి ప్రైవేటు వాహనాలు, ఆటోలు, మోటార్ సైకిళ్లు ఈ రోడ్డులో ప్రయాణం చేయాల్సిందేనని పేర్కొన్నారు. అటువంటి రోడ్డు మరమ్మతులకు తక్షణం అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. గుంతల కారణంగా ప్రయాణికులకు అదనపు ప్రయాణ సమయం పడుతోందని, గుంతల కారణంగా వాహనాలు దెబ్బతింటున్నాయని, వాహనాలకు పెట్రోలు, డిజల్ ఇంధనం అదనంగా కాలుతోందన్నారు. ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడుతోందని వివరించారు. గత ప్రభుత్వ కాలంలో రోడ్ల నిర్మాణం, నిర్వహణ నిర్లక్ష్యానికి గురయిందని, తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్ల పరిస్థితి మెరుగవుతుందని ప్రజలు ఆశించారని పేర్కొన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చి కూడా ఐదు నెలలు గడుస్తున్నదని, అయినా రోడ్లు మరింత అధ్వాన్నంగా మారాయి తప్ప అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు వంటి మూడు నియోజకవర్గాలకు సంబంధించిన లక్షలాదిమంది ప్రజలకు జిల్లా కేంద్రానికి చేరుకునేందుకు ఏకైక రోడ్డు ఇదేనన్నారు. తక్షణం ఎమ్మిగనూరు -కోడుమూరు మధ్య రోడ్డు మరమ్మతులకు అవసరమైన నిధులు కేటాయించి ఎమ్మిగనూరు-కోడుమూరు రోడ్డును ప్రయాణానికి అనుగుణంగా అభివృద్ధి చేయాలని కోరారు.



రాష్ట్రస్థాయికి ఎంపికయిన క్రీడాకారులకు దుస్తున్న పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

ప్రోత్సహిస్తే స్పోర్ట్స్ క్యాపిటల్‌గా కర్నూలు

సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ


ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

మార్షల్ ఆర్ట్స్ చిన్నారులకు ఎంతో మంచిదని కర్నూలుకు చెందిన ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. కర్నూలు లోని మున్సిపల్ హైస్కూలు మైదానంలో సిలంబం శిక్షకుడు రాఘవేంద్ర ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణా శిబిరానికి డాక్టర్ శంకర్ శర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నవంబం10న గుంటూరులో జరిగే సౌత్ జోన్ చాంపియన్‌షిఫ్ పోటీలకు కర్నూలు నుంచి వెళ్తున్న 11 మంది క్రీడాకారులను డాక్టర్ శంకర్ శర్మ అభినందించారు. గుంటూరుకు వెళ్లే క్రీడాకారులకు టీషట్లు పంపిణీ చేశారు. మార్షల్ ఆర్ట్సలో చిన్నారులు పాల్గొనడం వల్ల వారు అన్ని రంగాల్లో రాణిస్తారని సూచించారు. సెల్ ఫోన్, మత్తు పదార్థాలు ఎక్కువైనందున సమాజంలో మహిళలపై ఆత్యాచార ఘటనలు ఎక్కువై వారికి భద్రత కరువైందన్నారు. ఆడపిల్లలు ఇంటి నుంచి బయటకు వెళ్లినప్పుడు వారు తిరిగి ఇంటికి వచ్చేంత వరకు వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారన్నారు. బాలికలు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల వారికి ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. మార్షల్ ఆర్ట్స్ లో పాల్గొనడం వల్ల వారికి క్రమశిక్షణ వస్తుందని తెలిపారు. చిన్నారులు క్రమశిక్షణతో మెలగడం వల్ల భారతదేశానికి భవిష్యత్తులో మంచి దేశంగా గుర్తింపు వస్తుందన్నారు. గుంటూరుకు వెళ్లే క్రీడాకారులకు శిక్షకుడు అన్ని వసతులు ఏర్పాటు చేయాలని డాక్టర్ శంకర్ శర్మ సూచించారు. సౌత్ జోన్ చాంపియన్ షిప్ పోటీలకు వెళ్లే క్రీడాకారులు మంచి ప్రతిభ కనబరిచి కర్నూలుకు మంచి పేరుతీసుకు రావాలన్నారు. క్రీడాకారులకు పండ్లు పంపిణీ చేశారు.

కిందకు జారుతున్న ట్రాన్స్ ఫార్మర్

స్థానికుల బేంబేలు - పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి- సి బెళగల్



మండలంలోని గుండ్రేవులలో పునరావాసం దగ్గర స్తంబానికి వేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రోజు రోజుకు కిందకు జారుతోంది. ప్రజలకు ఇబ్బంది లేకుండా స్తంబానికి 10 అడుగుల ఎత్తులో అప్పటి విద్యుత్ అధికారులు వేశారు. అయితే బాధ్యతారాహిత్యంగా వేయడం వలన గాలికి, వర్షాలకు ఆ ట్రాన్స్ ఫార్మర్ కిందకు జరుతుండటంతో ఎక్కడ ప్రమాదం పొంచి ఉందని స్థానికులు బేంబేలెత్తిపోతున్నారు. అధికారులకు, నాయకులకు తెలిపినా పట్టించుకోవడం లేదని, ప్రమాదాలు జరగక ముందే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఉపాధ్యాయులకు అండ యుటిఎఫ్

ప్రజాశక్తి-ఆదోని


కొత్తగా ఎన్నికయిన యుటిఎఫ్ మండల కమిటీతో ఉపాధ్యాయులు

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం యుటిఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుందని, బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆ సంఘం జిల్లాసహాధ్యక్షులు బి.జీవిత, జిల్లా కార్యదర్శి టి.గాదిలింగ అన్నారు. ఆదివారం యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల సందర్భంగా మునిసిపల్ ఉన్నత పాఠశాలలో వై.రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మహాసభనుద్దేశించి బి.జీవిత మాట్లాడుతూ యుటిఎఫ్ స్థాపించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవాలు జరుపుకుంటున్నామని తెలిపారు. అందరికి సమాన అవకాశాలు ఉండాలనే ఉద్దేశ్యంతో సోషలిస్టు సమాజం కోసం యుటిఎఫ్ సంఘాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. యుటిఎఫ్ ద్వారా ఎన్నో లక్ష్యలు, ఆశయాలు, డిమాండ్స్ సాధించుకున్నామన్నారు. హక్కుల కోసం, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం పోరాటం చేశామని, ప్రత్యామ్నాయ విద్యా విధానం కోసం పోరాడింది యుటిఎఫ్ మాత్రమే నని పేర్కొన్నారు. 1991లో వచ్చిన ఆర్థిక సంస్కరణల ఫలితంగా ప్రభుత్వంలో, ఉపాధ్యాయుల్లో ఆలోచన ధోరణలు మారుతూ వచ్చాయని తెలిపారు. ముందు తరం నాయకులు ఎక్కడ పని చేస్తుంటే అక్కడే నివాసం ఉండి స్థానికులతో, విద్యార్థుల తల్లిదండ్రుల్లో మమేకమై పని చేసేవారని చెప్పారు. ఉపాధ్యాయులు వైద్యులుగా, పోస్టుమెన్స్, ఫీల్డ్ అసిస్టెంట్లుగా ప్రజలకు సేవ చేసారని, సమాజంలో మిళితమై పని చేసేవారని పేర్కొన్నారు. ఉ పాధ్యాయులకు, విద్యారంగానికి ఉపయోగపడే ఏ శిక్షణనైనా యుటిఎఫ్ స్వాగతిస్తుందని తెలిపారు. అనవసర ఆప్‌ల భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యారంగం ఉంటేనే మనం, సంఘం ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ బడులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి పై వుందని తెలిపారు. ప్రభుత్వ కొత్త యాక్ట్ తీసుకువచ్చి ప్రతిఏడాది ఉపాధ్యాయులకు బదిలీలు, ప్రమోషన్లు ఉండేలా చేస్తామని చెబుతున్నారని అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయులకు రూ.20వేల కోట్లు బకాయిలు ఉన్నాయని, రూ.3.50 కోట్లు మాత్రమే తీర్చారని చెప్పారు. పిఆర్‌సి కమిషన్ వేయాలని, అప్పటి లోపు ఐఆర్ సాధించుకోవాలన్నారు. జిల్లాకార్యదర్శి టి.గాదిలింగప్ప మాట్లాడుతూ 1974, ఆగస్టు 10న యుటిఎఫ్ స్థాపించబడిందని చెప్పారు. అప్పటి నుంచి విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయ సమస్యలపై పోరాడుతుందన్నారు. ప్రభుత్వాలకు తాబేదారులుగా యుటిఎఫ్ ఎప్పుడూ పని చేయలేదని పేర్కొన్నారు. 117 జిఒపై ఏ సంఘం నోరుమెదపకపోతే యుటిఎఫ్ ఆందోళన చేసిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు మూతపడితే పేద విద్యార్థులు నష్టపోతారని చెప్పారు. అనంతరం నూతన ఆదోని యుటిఎఫ్ మండల కమిటీని ఎనుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా జి. సుజాత, అధ్యక్షులుగా జి నాగేంద్ర , సహాధ్యక్షులు రాముడు, సహాధ్యక్షులు జి. కళ్యాణి, ప్రధాన కార్యదర్శి వై. రామాంజనేయులు ఆర్థిక కార్యదర్శి ఉశేని, మండల కార్యదర్శులు జి జనార్ధన, జి.జనార్ధన్, వై. ఉరుకుందయ్య, జి.శివకుమార్‌గౌడ్, హనుమంతు, సిద్ధప్ప, అరుణ జ్యోతి, అన్నపూర్ణ, కె రమేష్, మహదేవ, చెన్నయ్య , మహిళా విభాగం కన్వీనర్ రేణుక బాయి, అకడమిక్ విభాగం కన్వీనర్ పి. రంగనాయకులు, సాంస్కృతిక విభాగం కన్వీనర్ ఆవుల బసప్ప, ఆడిట్ కన్వీనర్ బి.మల్లయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు జి.నాగేంద్ర, వై.రామాంజనేయులు, వి.పాపయ్య, కె.రుద్రముని, పెద్దయ్య, నరసయ్య గౌడ్, భోజరాజు, పి.నాగలక్ష్మి, భాగ్యమ్మ, జి. రామాంజనేయులు, సిపిఎస్ కన్వీనర్ శ్రీకాంత్ లను ఎన్నుకున్నారు.

మనం నిర్వర్తించే విధులను బట్టే గుర్తింపు

బదిలీపై వెళుతున్న పోలీసులకు సన్మానం

ప్రజాశక్తి-చిప్పగిరి


బదిలీపై వెళుతున్న పోలీసులను పూలమాల శాలవ తో సన్మానిస్తున్న పోలీస్ సిబ్బంది

మనం నిర్వర్తించే విధులలో ప్రజలకు మంచి జరిగినప్పుడే మనకు సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఎస్ఐ సతీష్ కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో బదిలీపై వెళుతున్న పోలీసులు యశ్వంత్ కుమార్, ఖాదర్ వలీలకు శాలువా, పూలమాలతో పోలీస్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. సన్మానం అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ బదిలీలు ప్రతి ఉద్యోగికి సర్వసాధారణమన్నారు. మనం విధులు నిర్వర్తించినచోట స్నేహబంధాలు, అనురాగాలు ఏర్పడతాయన్నారు. అలాంటప్పుడే మనం ఇక్కడే ఉంటే బాగుండు అనే ఉద్దేశం మనకు ఏర్పడుతుందన్నారు. బదిలీపై వెళుతున్న ఇద్దరు కూడా వారి విధులలో మంచి ప్రతిభ కనబరిచారని, స్టేషన్ కు కూడా అందుబాటులో ఉండి ఎస్ఐకి సహకారం అందించారన్నారు. బదిలీపై వెళుతున్న యశ్వంత్ కుమార్, ఖాదర్ వలీ మాట్లాడుతూ స్టేషనులో మాకు సహకరించిన ఎస్ఐకి, తోటి ఉద్యోగస్తులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పోలీసులు మహబూబ్ బాష, భాస్కర్, షబ్బీర్ బాష, మహేంద్ర కుమార్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సిల్వర్ జూబ్లిలో ఉపాధ్యాయుల ఆశీస్సులు

ప్రజాశక్తి- మంత్రాలయం



మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 25 ఏళ్ల తర్వాత ఉపాధ్యాయులను కలిసి సన్మానాలు చేసి వారి ఆశీస్సులు పొందారు. 1997- 98లో స్థానిక జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివిన విద్యార్థులు 25 సంవత్సరాల తర్వాత కలసి సిల్వర్ జూబ్లీ వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పించిన ప్రధానోపాధ్యాయులు సోమప్ప, గణితం, సామాన్య శాస్త్రం, వ్యాయామ ఉపాధ్యాయులు విశ్వేశ్వరయ్య , కేశవయ్య, మహమ్మద్ ఇస్మాయిల్ లను పూర్వ విద్యార్థులు అందరూ కలిసి శాలువలతో పూలమాల వేసి జ్ఞాపకలను అందజేసి ఘనంగా సన్మానించారు. అనంతరం సిల్వర్ జూబ్లీ వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో విద్యాసాగర్, అశ్వత్ నారాయణరెడ్డి, ఎం.రాఘవేంద్ర, రామ్మోహన్, శ్రీధర్ స్వామి, దేవేంద్ర, నాగరాజు, మల్లికార్జున, రఘునాథ్ , రఘునాథ్, వాసుదేవేంద్రరావు భీమన్న గౌడు, నాగరాజు, వెంకటేష్, ప్రకాష్ రెడ్డి, రాము, రవికుమార్, భీమయ్య, భీమయ్యగౌడ్, రాజశేఖర్ రెడ్డి, చెన్నారెడ్డి, టీఎస్ వీరన్న, సుభాను, శివ శంకర్, గురుస్వామి, రవిబాబు, పరిమళ, రూపాదేవి, పద్మావతి, మాధవి లత , సుభాషిణి ,రాధిక ,మల్లమ్మ , వసుంధర, సుందరమ్మ, ధనలక్ష్మి, జ్యోతి అనసూయ, విజయలక్ష్మి, మధుమతి, సునీత, ప్రసాదు, గోవింద నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకాలను వెంటనే పునరుద్ధరించాలి

ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-మంత్రాలయం



మాధవరం ఎత్తిపోతల పథకాన్ని పరిశీలిస్తున్న ఎపి రైతుసంఘం నాయకులు

నియోజకవర్గంలో మూడు మండలాల్లోని రైతుల పంట పొలాలకు సాగునీరు అందించే ఎత్తి పోతల పథకాల పంపౌస్‌లను వెంటనే పునరుద్ధరించాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం గురు రాఘవేంద్ర ప్రాజెక్టు కింద రాంపురం గ్రామ పరిధిలోని మాధవరం ఎత్తిపోతల పథకం పంపౌస్‌ను పరిశీలించారు. వారు మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం కృషి చేస్తామని చెబుతున్న టిడిపి ప్రభుత్వం మాధవరం, బసలదొడ్డి ఎత్తిపోతల పథకాలను ధ్వంసం చేసి సుమారు మూడు నెలల అవుతున్నప్పటికీ పునరుద్ధరించడంలో జాప్యం చేయడం రైతులను నష్ట పరచడమే అన్నారు. సాగు నీటి ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేస్తున్నామని కబుర్లు చెప్పడం తప్ప వాటి మరమ్మతులకు నిధులను ఇంతవరకు విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు. సుమారు రూ.10 వేల ఎకరాలకు సాగునీరు అందించే ఎత్తి పోతల పథకాలను నాశనం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పంపౌస్‌ల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. కొందరు రైతులు నదీ తీరంలో ప్రైవేటు మోటార్లు ఏర్పాటు చేసుకొని పంటలకు సాగునీరు అందిస్తున్నారని, సాగు నీరు లేక పంటలు ఎండి కొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఖర్చుతో కూడిన పనులు కాబట్టి ప్రభుత్వమే మోటార్లను వెంటనే మరమ్మతులు చేపట్టాలని నెలలోపు సమస్యను పరిష్కరించాలని లేనిపక్షంలో మూడు మండలాల్లోని రైతులతో కలిసి జిల్లా కలెక్టర్ వారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మల్లయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తిక్కన్న, జిల్లా కార్య వర్గ సభ్యులు పరమేష్, రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుణశేఖర్, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు హెచ్.జయరాజు, రైతు సంఘం మండల నాయకులు వీరేష్, రామకృష్ణ, శ్రీనివాసులు కెవిపిఎస్ మండల నాయకులు సురేష్, ఎలీషా తదితరులు పాల్గొన్నారు.

గుండ్లకొండ - పి.కోటకొండ మధ్య సబ్ కెనాల్ నిర్మించాలి

- కరువుతో అల్లాడుతున్న రైతాంగాన్ని ఆదుకోండి

ప్రజాశక్తి- దేవనకొండ


ఎంపి బస్తిపాటి నాగరాజును సన్మానించి స్మస్యలు తెలుపుతున్న టిడిపి నాయకులు

మండలంలోని గుండ్లకొండ, పికోటకొండ గ్రామాల మధ్య హంద్రీ కాల్వ పై సబ్‌కెనాల్ నిర్మించాలని టిడిపి మండల నాయకులు బంటుపల్లి వెంకటస్వామిగౌడ్, పరమేష్ గౌడ్, బండపల్లె శ్రీనివాసులు గౌడు , బంటుపల్లి వెంకటేష్ గౌడులు కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజును కోరారు. ఆదివారం వారు ఎంపితో కలసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హంద్రీనీవా సుజల స్రవంతి ప్రధాన కాలువ పోతున్నా పూర్తి స్థాయిలో పొలాలకు నీరు తరలించుకునే పరిస్థితి లేదన్నారు. గుండ్లకొండ నుంచి పి కోటకొండ మధ్య హంద్రీ నీవా కాలువకు తూము ఏర్పాటు చేసి నీటిని తరలిస్తే మండల పరిధిలోని గుడిమిరాళ్ళ, బంటుపల్లె, నేలతలమర్రి, బైరవకుంట, బుర్రకుంట, వెంకటాపురం, చెల్లెల చెలిమిల, బేతపల్లి, బండపల్లి, జిల్లెలబుడకల, మాధపురం, కోటకొండ తదితర సుమారు 15 గ్రామాల పరిధిలోని 10 వేల ఎకరాల భూములకు సాగునీరు, వేలాది కుటుంబాలకు తాగునీరు అందించడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. చెరువులు నింపడం ద్వారా అదనంగా మరికొన్ని ఎకరాలకు సాగు నీరు అందించే అవకాశం ఉందన్నారు. అంతేకాక భూగర్భ జలాలు కూడా పెరిగే అవకాశం ఉందన్నారు. రెండు పంటలు పండించుకొని రైతులు ప్రశాంతమైన జీవనం కొనసాగించే అవకాశం ఉందన్నారు. ఎలాంటి ఉపాధి అవకాశాలు లేక హైదారాబాద్, బెంగుళూరు, ముంబాయి, చెన్నైకి వలసలు వెళుతున్నారని నీరు పుష్కలంగా ఉంటే స్థానికంగా ఉపాధి దొరకడం వల్ల వలసలు కూడా తగ్గుతాయన్నారు. ఇదే విషయాన్ని గతంలో తమ గ్రామాల మీదుగా పాదయాత్రకు వచ్చిన టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్యాశాఖ మాత్యులు నారా లోకేష్‌కు వినతి పత్రం ఇచ్చారు. టిడిపి అధికారంలోకి వస్తే తప్పకుండా కాలువ నిర్మిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీ మేరకు గుండ్ల కొండ నుంచి పి.కోటకొండ వరకు హంద్రీ నీవా సబ్ కెనాల్ నిర్మించి మండల రైతులకు న్యాయం చేయాలని కోరారు.

పల్లెల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు

జాశక్తి-ఆదోనిరూరల్

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి మద్యం దుకాణాల లైసెన్సు ఫీజులు భారీగా పెరగడంతో దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులు బెల్టు షాపులకు తెరతీశారు. ఆదోని మండలం పరిధిలో పెద్దహరివణం, సంతేకూడ్లురు, పెద్దతుంబలం, కుప్పగల్, మండిగిరి, ఆరెకల్లు, నాగలాపురం గ్రామాల్లో బెల్టు షాపులు వెలిశాయి. దుకాణాలు లేని చోట ముఖ్య కూడళ్లకు సమీపంలో, గ్రామాల్లో బెల్ట్‌షాపులను ఏర్పాటు చేయించారు. మద్యం దుకాణం దక్కించుకున్న వారే బెల్టు షాపు ఇవ్వడంతో ఇక బెల్టు షాపు నిర్వాహకులు ఇష్టమొచ్చిన రీతిలో వ్యవహరిస్తున్నారు. ఏకంగా సిట్టింగ్ రూమ్‌లు ఏర్పాటు చేసి తాగిస్తున్నారు. బహిరంగంగానే రాత్రి, పగలు తేడా లేకుండా మద్యం విక్రయాలు సాగిస్తున్నారంటూ స్థానికులు చెబుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో జే బ్రాండ్ మద్యంతో ప్రజారోగ్యాన్ని గుల్ల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నాణ్యమైన మద్యాన్ని అందుబాటులోకి తెస్తామని ఇచ్చిన హామీ మేరకు కొత్తగా మద్యం దుకాణాలను కేటాయించారు. దీంతో ప్రైవేటు మద్యం దుకాణాలను దక్కించుకున్న వారు వ్యాపారాన్ని విస్తరించేందుకు పలు మార్గాలు అన్వేషిస్తున్నారు. దుకాణాలు లేని శివారు ప్రాంతాలను సైతం మద్యం విక్రయాలు సాగించే విధంగా ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా విస్తారంగా బెల్ట్‌షాపులను ఏర్పాటు చేస్తున్నారు. డాబా, రెస్టారెంట్లలోను నిబంధనలకు విరుద్ధంగా దర్జాగా మద్యం విక్రయాలు సాగిస్తున్నారు.

మామూళ్ల మత్తుల్లో పోలీసులు

గ్రామాల్లో బెల్టు షాపులు పగలు, రాత్రి తేడా లేకుండా వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా కొనసాగుతోంది. అయితే ఇది నిర్మూలించాల్సిన పోలీస్ అధికారులు స్టేషన్‌కు ఇంత ఇచ్చుకోండి పనులు చేసుకోండి అనే నినాదంతో నెలకు మామూళ్లు మాట్లాడుకొని ఈ వ్యాపారానికి తలుపులు తెరిచినట్లు సమాచారం

పేకాట స్థావరం పై దాడులు

12 మంది అరెస్టు -రూ.21,565 స్వాదీనం...

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరు మండలం లోని కమ్మరచేడు గ్రామంలో శనివారం రాత్రి పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు మంగలి నాగరాజు ఇంట్లో దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న 12 మందిని అరెస్టు చేసిన్నట్లు ఎస్ఐ వెంకట నరసింహులు ఆదివారం తెలిపారు. మంగలి నాగరాజు,ప్రభాకర్ రెడ్డి తో పాటు మరో 10 మంది మందినీ అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.21,565 నగదు ,రెండు ద్విచక్ర వాహనాలు, 3 సెల్ ఫోన్లు స్వాదీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఆదివారం తెలిపారు..


కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న ఉమాపతినాయుడు

కార్యకర్తలకు అండగా ఉంటా : ఉమపతి

ప్రజాశక్తి-ఆదోని

కార్యకర్తల సంక్షేమమే టిడిపి లక్ష్యమని టిడిపి సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడు తెలిపారు. ఆదోని నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆధ్వర్యంలో ఆదోని పట్టణంలోని వాల్మీకినగర్ చిన్న శక్తి గుడి ఏరియాలలో టిడిపి సభ్యత్వం నమోదు కార్యక్రమం ప్రారంభించారు. 1వ వార్డ్ కౌన్సిలర్ పార్వతి , తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరిసాకారే మారుతిరావు హాజరై సభ్యత్వ నమోదు చేయించారు. ఉమాపతి నాయుడు మాట్లాడుతూ టిడిపి అంటే క్రమశిక్షణ గల పార్టీ అని పార్టీలో సభ్యత్వం ఉన్న నాయకులను కార్యకర్తలను కాపాడుకోవడం చంద్రబాబు నాయుడు బాధ్యతని, అదిశగా కార్యకర్తల సంక్షేమం కోసం పాటు పడుతున్నారన్నారు. ఆదోని నియోజకవర్గం నాయకులకు కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా పార్టీ ఇంచార్జ్ మీనాక్షి నాయుడు పార్టీ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు టిడిపి సానుభూతిపరులు భారీ ఎత్తున సభ్యత్వ నమోదు అధిక సంఖ్యలో చేసుకోవాలన్నారు. వాల్మీకి వెంకటేష్, బాబులు, ఈరన్న, లక్ష్మన్న, వెంకటేష్, కాశి, జయరాం, నాగరాజ్, నాగేంద్ర ఉన్నారు.

డబ్బుల కోసం తండ్రిని చంపిన కసాయి కొడుకు..?

పరారీలో ఉన్న చిన్న కొడుకు కందుల కాసీం

ప్రజాశక్తి - ఆలూరు: మండల పరిధిలోని పెద్దహోతూరు గ్రామంలో శనివారం రాత్రి డబ్బులు కోసం కన్న తండ్రిని కసాయి కొడుకు చంపిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు పెద్ద హోతూరు గ్రామానికి చెందిన కందుల శేఖన్న(79)కు ముగ్గురు కొడుకులు, ఒక కూతురు ఉంది. 10 ఏళ్ల కిందట శేఖన్న భార్య అనారోగ్యంతో మతి చెందింది. కూతురుని పెళ్లిచేయగా,పెద్దకొడుకు శేక్షవలి గూళ్యం గ్రామంలో నివాసం ఉంటున్నాడు. రెండవ కొడుకు షరీఫ్, చిన్నకొడుకు కాసీంలు పెళ్లి చేసుకొని సొంత గ్రామంలో ఉంటున్నారు. కాశిం డ్రైవర్‌గా పనిచేస్తూ మద్యంకు బానిస అయి తన తండ్రి కందుల శేఖన్న దగ్గర ఉన్న కొంత మొత్తం రూపాయల కొరకు గొడవ పడి రాత్రి తీవ్రంగా కొట్టడంతో మృతి చెందినట్లు పలు అనుమానాలు వ్యక్తం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నారు.

నేడు కలెక్టరేట్లో గ్రీవెన్స్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కలెక్టరేట్ కార్యాలయంలోని సునయన ఆడిటోరియంలో సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష ఆదివారం వెల్లడించారు. ప్రజలు నేరుగా వచ్చి తమ సమస్యలను విన్నవించుకోవాలని పేర్కొన్నారు. అన్ని రెవెన్యూ మున్సిపల్ మండల కేంద్రాల్లో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

ఆటో డ్రైవర్ మృతి

ప్రజాశకి- వెల్దుర్తి


సరైన సమయానికి డాక్టర్లు స్పందించ లేదని వెల్దుర్తి ప్రభుత్వ ఆస్పత్రిముందు ఆందోళన చేస్తున్న మృతుని బంధువులు

వెల్దుర్తి మండలం సూదేపల్లె గ్రామానికి చెందిన జులపాల సునీల్ కుమార్ (22) మృతి చెందాడు. మతుని బంధువులు తెలిపిన వివరాల మేరకు సునీల్ కుమార్ తన సొంత ఆటోలో సూదేపల్లి నుండి క్రిష్ణగిరి మండలం బాపలదొడ్డి గ్రామానికి వ్యవసాయ కూలీలను తీసుకువెళ్లి పనుల అనంతరం తిరిగి స్వగ్రామానికి తీసుకొని వెళ్లేవాడు. రోజులాగే ఆదివారం ఉదయం కూలీలను తీసుకు వెళ్లాడు. మధ్యాహ్నం భోజనానంతరం ఆటోలో నిద్రిస్తున్నాడని కూలీలు తెలిపారు. పనుల అనంతరం నిద్రలేపేందుకు ప్రయత్నించగా ఎంతకు స్పందించకపోవడంతో హుటాహుటిన అదే ఆటోలో వెల్దుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుని బంధువులు రెగ్యులర్ డాక్టర్లతో కాకుండా ట్రైనింగ్ డాక్టర్లతోనే వైద్యం చేయిస్తున్నారని, వారుసరైన సమయానికి స్పందించ లేదని సిబ్బందిపై ఆందోళన వ్యక్తం చేశారు. వెల్దుర్తి పోలీసులు మృతుని బంధువులకు సర్ది చెప్పి పంపించారు. ఆసుపత్రిలో మందుల కొరత ఉందని, బయట మెడికల్ షాపులలో మందులు తీసుకోవాలని వైద్య సిబ్బంది పంపుతున్నట్లు రోగులు వాపోతున్నారు.

సమస్యలుంటే ఫిర్యాదు చేయండి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగరపాలక సంస్థకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే ఫిర్యాదు చేయాలని కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు కోరారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుండి కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

డంప్ యార్డుగా కెఎంసి సెంట్రల్ గార్డెన్

పిచ్చి మొక్కలతో విద్యార్థులకు ఆహ్లాదం ,ప్రశాంతత కరువు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



కర్నూలు మెడికల్ కళాశాల రాష్ట్రంలోని మంచి పేరు ప్రఖ్యాతులు సాధించింది. ఈ కళాశాలలో 2000 సంవత్సరంలో సెంట్రల్ గార్డెన్ పేరుతో విద్యార్థులకు ఆహ్లాదాన్ని ప్రశాంతతను అందించేందుకు డాక్టర్ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఒక పార్కును ఏర్పాటు చేశారు. కళాశాలలో సుమారు 1200 పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, నాన్‌టీచింగ్ స్టాఫ్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్నారు. మీరందరూ విరామ సమయంలో సెంట్రల్ గార్డెన్‌లో విశ్రాంతి తీసుకుని ఆహ్లాదకరంగా ఉండేవారు. ఆ పార్కులో నేడు పిచ్చి మొక్కలు పెరిగి విద్యార్థులకు ఆహ్లాదాన్ని అందించలేక పోతుంది. పైపెచ్చుగా గార్డెన్‌చుట్టూ గోడలపై వేసిన ఇనుప గ్రిల్‌ను తొలగించి డంప్ యార్డుగా మార్చేశారు. పార్కులో చుట్టూరా చెత్తాచెదారం వేస్తూ ఉండడంతో అటుగా వెళుతున్న వారందరికీ దుర్వాసన వస్తుంది. పార్కు నిండుగా పిచ్చి మొక్కల పెరిగి విష పురుగులకు నిలయంగా మారింది. పార్కులో చెత్తాచెదారాన్ని వేస్తుండటం పిచ్చి మొక్కలను తొలగించకుండా ఉండటాన్ని కళాశాల ప్రిన్సిపల్ దృష్టికి తీసుకువెళ్లారు.

పార్కును శుభ్రం చేయిస్తాం

డాక్టర్ చిట్టి నరసమ్మ , మెడికల్ కళాశాల ప్రిన్సిపల్



కళాశాల ఆవరణలోని సెంట్రల్ గార్డెన్‌లో పిచ్చి మొక్కలు పెరిగింది వాస్తవం. నేను ప్రిన్సిపల్‌గా రాకమునుపే సెంట్రల్ గార్డెన్‌లో పిచ్చి మొక్కలు పెరిగి ఉన్నవి. అప్పటికే కర్నూలు మెడికల్ కళాశాలకు నూతన భవనం నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించారు. అప్పటినుంచి కళాశాల నిర్మాణంలో భాగంగా కొంత ఖాళీ స్థలం చూపించాల్సి ఉంది. కళాశాల నిర్మాణం ఆలస్యం కావడంతో సెంట్రల్ గార్డెన్‌ను ఎవరూ పట్టించుకోలేదు. త్వరలో ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి సెంట్రల్ గార్డెన్‌ను శుభ్రం చేయిస్తాను. విద్యార్థులకు ఆహ్లాదాన్ని, ప్రశాంతతను అందించేందుకు కృషి చేస్తాం.


సాధీనం చేసుకున్న మద్యం ఎక్సైజ్ పోలీసులు

కర్నాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - ఆలూరు

కర్ణాటక నుండి అక్రమంగా మద్యంను తరలిస్తున్న బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకొని ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఆలూరు ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ జి.మారుతి ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమాచారం మేరకు మండలంలోని కురుకుంద గ్రామం నుండి హెబ్బటం గ్రామ మధ్యలో దాడి చేసి బొలెరో వాహనంలో తరలిస్తున్న ఓసి 90 ఎంఎల్ వి34 బాక్స్‌లు సీజ్ చేశామన్నారు. మద్యం తరలిస్తున్న ముగ్గురు ముళ్ళతవ్ షిష్, రాఘవేంద్ర, ముతప్పను అరెస్ట్ చేశామన్నారు. ఈ దాడుల్లో సిబ్బంది గిరిబాబు, శంకర్ నాయక్, పరిక్షిత పాల్గొన్నారు.



పోలీస్ వ్యవస్థ, ఆయుధాలు పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సతీష్ కుమార్

పోలీస్ వ్యవస్థ పై అవగాహన అవసరం

ప్రజాశక్తి-చిప్పగిరి

రేపటి భవిష్యత్తు మీరే కావున ప్రతి ఒక్క విద్యార్థి కూడా పోలీసులు నిర్వహిస్తున్న విధులు , ఆయుధాలు, చట్టం వీటన్నిటిపై అవగాహన పెంచుకోవాలని ఎస్ఐ సతీష్ కుమార్ విద్యార్థులకు సూచించారు. శనివారం చిప్పగిరి పోలీస్ స్టేషన్‌లో పోలీసు అమరవీరుల వారోత్సవాలలో భాగంగా ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ బాలికలు ధైర్యంతో ముందుకెళ్లాలని, బాలురతో పోటీపడి మంచి ప్రతిభ కనపర్చాలన్నారు. బాలికలుగృహ చట్టంలో ఉన్న ప్రతి సమాచారం తెలుసుకొని ఉండాలన్నారు. పోలీసులు ఏ సమయంలో ఆయుధాలు వాడుతారనే విషయాన్ని కూడా తెలుసుకోవాలన్నారు. ముఖ్యంగా పాఠశాలలో మంచి సత్ప్రవర్తనతో మెలిగి చదువులో మంచి ప్రతిభ కనబరిచినట్లయితే భవిష్యత్తులో మంచి ఉద్యోగం సంపాదించుటకు అవకాశం ఏర్పడుతుందన్నారు. పోలీసులు సుబ్రహ్మణ్యం, ఖాదర్‌వల్లి, భాస్కర్, షబ్బీర్, యశ్వంత్, కుమార్, ఉపాధ్యాయులు రంగనాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.